andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 । కనిష్ఠం 25.5
నిర్మల్
జిల్లా వార్తలు
సోమవారం 12 ఆగస్టు 2024




ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు11: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతీ భారతీయుడు తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని రాష్ట్ర బీజేపీ నాయకుడు రావుల రాంనాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన నిర్మల్ మండల కార్యవర్గ సమావేశానికి ఆయన హాజరు కాగా, మండల అధ్యక్షుడు తోకల అనిల్ అధ్యక్షత వహించారు. ఈనెల 15 వరకు అన్ని గ్రామాల్లో ఇంటింటా మూడురంగుల జెండా దేశభక్తిని పెంపొందించేలా ఎగురవేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి నరేష్, లవ కుమార్‌గౌడ్, ఉపసర్పంచ్ నర్సారెడ్డి, కార్యవర్గసభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.



- ఆలయ ఈవోను బదిలీ చేసిన దేవాదాయ శాఖ
- మళ్లీ పాత ఈవోకే ఇన్‌చార్జీ బాధ్యతలు
- భక్తులకు కష్టాలు మొదలు

బాసర గుడిలో మళ్లీ ఇన్‌చార్జి పాలన!



బాసర, ఆగస్టు11: ములిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో పరిపాలన పరిస్థితి నెలకొంది. నిత్యం ఏదో ఘటన, అవినీతి ఆరోపణలతో నిత్యం రచ్చకెక్కే బాసర దేవస్థానం ఈవో బదిలీ అయ్యారు. నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులైన ఆయనకే బాసర ఆలయ ఇన్‌చార్జీ బాధ్యతలను దేవాదాయ శాఖ అప్పగించింది. రెగ్యులర్ అధికారి వచ్చాడనుకున్న రెండేళ్లకే బదిలీ కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి బాసర జ్ఞాన సరస్వతి ఆలయంలో ఇన్‌చార్జీ ఈవో పాలన కొనసాగింది. ఈ సమయంలో అనేక అవినీతి అక్రమాలు బయటపడ్డాయి. ఎన్నో వివాదాస్పద ఘటనలూ చోటుచేసుకున్నాయి. అక్రమాలపై దేవాదాయ శాఖ విచారణ చేపట్టింది. పరిపాలన గాడితప్పి భక్తులకు సమస్యలు ఏర్పడ్డాయి. స్థానికులు భక్తుల నుంచి విమర్శలు వెల్లువెత్తడంతో రెండేళ్ల క్రిందట రెగ్యులర్ ఈవోను పంపించింది. సరిగ్గా రెండేళ్ల కాలం కూడా పూర్తి కాకుకుండానే ఇప్పుడు అధికారి బదిలీ అయ్యారు.

• అభివృద్ధి లేదు.. అధికారులు లేరు..

గత ప్రభుత్వ హయాంలో అనేక దేవాలయాల వద్ద అభివృద్ధి జరిగింది. యాదాద్రి, వేములవాడ, కొండగట్టు, భద్రాచలం వంటి ప్రముఖ దేవాలయాల రూపురేఖలు మార్చేశారు. బాసరపై కూడా అప్పటి ప్రభుత్వం అనేక హామీలు గుప్పించి అభివృద్ధి మరిచిపోయింది. చివరిదశలో రూ.50కోట్లు కేటాయించినప్పటికీ పనులు మాత్రం చేపట్టలేదు. ఇప్పుడున్న ప్రభుత్వం ఆ 50 కోట్లను కూడా లాక్కొని బాసర అభివృద్ధి ఆశలపై నీళ్లు చల్లింది. అభివృద్ధిని అటకెక్కించి ఉన్న రెగ్యులర్ అధికారులను బదిలీ చేసింది. ఆలయానికి పెద్దదిక్కుగా ఉన్న ఆలయ ఈవోకు స్థానచలనం కల్పించి మళ్లీ ఆయనకే ఇన్‌చార్జీ బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడైనా ఒక అధికారిని బదిలీ చేస్తారు లేదంటే ఆయనకే ఇతర ఇన్‌చార్జీ బాధ్యతలను అప్పగిస్తారు. కానీ ఇక్కడ మాత్రం ఉన్న ఈవోను తీసేసి రెగ్యులర్ బాధ్యతలను ఇన్‌చార్జీగా మార్చడంపై భక్తులు, స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇది బాసర అమ్మవారి ఆలయంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని స్థానికులు విమర్శిస్తున్నారు.

• భక్తులకు తప్పని కష్టాలు

అరకొర వసతులతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులకు ఇక వారి కష్టాలు ఇప్పట్లో పరిష్కారం అయ్యే విధంగా కనిపించడం లేదు. వసతుల లేమితో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ప్రధాన ఆలయం ఇరుకుగా ఉండడం, క్యూకాంప్లెక్స్ లేకపోవడం, ఇతర మౌలిక వసతుల లేమితో భక్తులు నిత్యం సమస్యలు ఎదుర్కొంటున్నారు. కనీసం తాగునీరు భక్తులకు అందించలేదని స్థితిలో దేవస్థానం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ఇన్‌చార్జీ పాలనతో భక్తుల సమస్యలు పరిష్కారం అవుతాయనుకోవడం దూరాశే అవుతుంది. దీనికి తోడు ఇప్పటికే దేవస్థానంలో కొందరి సిబ్బందిపై అనేక అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటివి ఇన్‌చార్జీ పాలనలో పెరిగే అవకాశం ఉంది. ఆలయాల సిబ్బందిలో జవాబుదారీతనం లోపించి మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది.

• అభివృద్ధి పనులపై ప్రభావం

అమ్మవారి ఆలయం వద్ద ప్రస్తుతం వంద గదుల సత్రం నూతన కార్యాలయ భవన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రెగ్యులర్ ఇంజనీరింగ్ అధికారులు లేరు. ఆలయ ఈవో కూడా ఇన్‌చార్జీ కావడంతో అభివృద్ధి పనులపై ప్రభావం పడే అవకాశం ఉంది. రూ. కోట్ల అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం సమస్య తలెత్తే ఆస్కారం ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బాసరకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా..

• విజయరామరావు, ఇన్‌చార్జీ ఈవో

నిజామాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా రెగ్యులర్ బాధ్యతలు ఉన్నా బాసరకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. సమయం ఉన్నప్పుడల్లా బాసరకు వెళ్తున్నాం. రెండేళ్ల నుంచి పనిచేస్తున్న కాబట్టి బాసర ఆలయంలో పరిస్థితులపై పూర్తి అవగాహన ఉంది. ముఖ్యంగా సెలవు దినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది ఆ రోజుల్లో బాసరకు తప్పకుండా వెళుతున్నాను.



ఎల్వత్‌లో రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

తానూర్, ఆగస్టు11: మండలంలోని ఎల్వత్ గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పవార్ రామరావుపటేల్ పర్యటించారు. ద్విచక్ర వాహనంపై గ్రామంలో తిరుగుతూ రోడ్లను పరిశీలించారు. పలు సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎల్వత్ నుంచి కార్యల గ్రామం వెళ్లే రోడ్డు వర్షాలకు దెబ్బతినడంతో ఆ వైపు రాకపోకలు నిలిచిపోయే ఆస్కారం ఉందని, తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. అనంతరం ఇటీవల గ్రామంలో మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ మండల నాయకులు శివాజీపటేల్, మాజీ సర్పంచ్‌లు చక్రధర్, సిందే హన్మంత్, అశోక్, సురేష్, తదితరులున్నారు.

• రేపు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండల కేంద్రం తానూర్‌లోని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే రామరావుపటేల్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు యాతలం చిన్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలలో తెలిపారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

నల్దుర్తి మాజీ సర్పంచ్ మృతి

మామడ, ఆగస్టు11: మండలంలోని నల్దుర్తి గ్రామానికి చెందిన సోమ్లా నాయక్ అనారోగ్యంతో ఆదివారం రోజున ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో చేశారు. ఆయన గ్రామంలో 1988 నుంచి 1995 వరకు ఏడేళ్లపాటు గ్రామానికి సేవలందించాడని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. గ్రామస్తులు ఆయన మృతి తీరని లోటని అన్నారు.



మామడ సమీపంలో చెట్టుకు ఢీకొన్న వ్యాన్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మామడ, ఆగస్టు11: మామడ సమీపంలో వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ నుంచి నిర్మల్‌కు వస్తున్న పాల వాహనం మామడ సమీపంలో ఆదివారం తెల్లవారు జామున అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. డ్రైవర్, క్లీనర్ వాహన క్యాబిన్‌లో ఇరుక్కుపోవడంతో జేసీబీ సహాయంతో వారిని బయటకు తీశారు. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో గాయాలైన డ్రైవర్ అనిల్, క్లీనర్ విఘ్నేష్‌లను చికిత్స నిమిత్తం జిల్లాఆసుపత్రికి తరలించారు. 108 పైలెట్ హఫీజ్, ఈఎంటీ సురేష్‌లు ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలి ంచారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు.





ఘటనాస్థలంలో గాయాలతో డ్రైవర్, క్లీనర్

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

• భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్ కుమార్



స్వాధీన పరుచుకున్న ద్విచక్ర వాహనాలు

భైంసా, ఆగస్టు 11: సైబర్ నేరాల బారిన పడకుండా ప్రతీఒక్కరు అప్రమత్తంగా వ్యవహరించాలని భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ సూచించారు. ఆదివారం భైంసా పట్టణంలోని కుంట ఏరియా పరిధిలో పోలీసు శాఖ చేపట్టిన కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. ఎలాంటి పరిస్థితుల్లో ఎవరికి కూడా తమ బ్యాంక్ అకౌంట్ల పాస్‌వర్డ్‌ల వివరాలను తెలుపవద్దన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్ ద్వారా వచ్చిన లింక్‌లను షేర్ చేయవద్దని పేర్కొన్నారు. ఎలాంటి బహుమతులు వచ్చాయని చెప్పిన, లక్కీ డ్రా ద్వారా విజేతలుగా ఎంపికయ్యారని వివరించిన, వివిధ కేసులు నమోదు అయ్యాయని భయ పెట్టిన స్పందించవద్దన్నారు. ఇదే క్రమంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూస్తే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, చట్టపరమైన చర్యలు తప్పవని వెల్లడించారు. పోలీసుశాఖకు ప్రతీఒక్కరు తమవంతు బాధ్యతగా సహకరించాలన్నారు. తమ తమ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు, అనుమానస్పదంగా సంచరించే వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సంబంధిత ప్రాంత పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. ప్రతీఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను విధిగా పాటించాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనానికి సంబంధించిన ధృవీకరణ పత్రాలు తమ వెంట ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడిపించరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహనాల యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా సన్మార్గంలో పయనిస్తూ ఉన్నత చదువులు చదివి భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలని పేర్కొన్నారు. గంజాయి క్రయ, విక్రయాలు చేపడితే ఉచలు లెక్కించక తప్పదన్నారు. ఇందులో టౌన్ సీఐ రాజారెడ్డి నేతృత్వంలో పట్టణ ఎస్ఐలు షరీఫ్, గౌస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కమ్యూనిటీ కంటాక్టు ప్రోగ్రామ్ జరిగింది. ఇందులో సరియైన ధృవీకరణ పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 102 ద్విచక్ర వాహనాలు, 8 ఆటోలు, టాటాఏఎస్ వాహనం కలిపి మొత్తం 111 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రోడ్లపై సంచరిస్తున్న పశువులకు వేలం

ఖానాపూర్, ఆగస్టు 11 : ఖానాపూర్ పట్టణ రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు, పట్టణ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న పశువులను మున్సిపల్ ఆధ్వర్యంలో నేడు వేలం పాట ద్వారా విక్రయించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా రేయింబవళ్లు రోడ్లపైనే ఉంటూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్న పశువులను ఆదివారం సాయంత్రం వరకు జరిమానాతో విడిపించుకుపోయేలా వాటి యజమానులకు అవకాశం కల్పించామని పేర్కొన్నారు. కొంతమంది ముందుకొచ్చి మరోసారి రోడ్లపై వదిలేయబోమని బాండ్ పేపర్‌పై హామీపత్రం రాసిచ్చి వెయ్యి రూపాయలు జరిమానా చెల్లించి విడిపించుకుపోయారని తెలిపారు. మిగతా పశువులకు నేడు ఉదయం 10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వేలం వేసి విక్రయిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు సోమవారం ఉదయం 10 గంటలలోపే ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానానికి తరలిరావాలని కోరారు. ఒకవేళ ఈ వేలానికి స్పందన రాకపోతే మిగిలిన పశువులను గోశాలకు తరలిస్తామని మున్సిపల్ చైర్మన్ సత్యం తెలిపారు.

'బీఎస్ఎన్ఎల్ సేవలు విస్తరించాలి'

కుంటాల, ఆగస్టు 11: మండలంలోని దౌనెల్లి గ్రామంతో పాటు అంబుగాం, సూర్యాపూర్, మెదన్‌పూర్, రాజాపూర్ గ్రామాలలో బీఎస్ఎన్ఎస్ సేవలు విస్తరించాలని బీజేపీ సీనియర్ జీవీ రమణారావు కోరారు. ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తండాలకు సిగ్నల్ అందించాలనే ఉద్దేశంతో గిరిజన గ్రామాల్లో టవర్లు నిర్మించారని, ఇందుకు సంబంధించిన బీఎస్ఎన్ఎల్ సిగ్నల్‌కు ఏర్పాట్లు చేయకపోవడంతో సెల్‌ఫోన్ సేవలు అందడం లేదడం లేదని అన్నారు. దీంతో దౌనెల్లి చుట్టు గ్రామాలతోపాటు తదితర గ్రామాలకు సిగ్నల్ వచ్చేలా చూడాలని డీల్లీలో అధికారులకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌కు సైతం టవర్ విషయమై అధికారులకు విన్నవించామని, రానున్న రోజుల్లో మండలంలోని ఆయా మారుమూల గ్రామాలకు సెల్‌ఫోన్ సేవలు అందించడం జరుగుతుందని పేర్కొన్నారు.

ఘనంగా అన్నాబాహుసాఠే జయంతి

తానూర్, ఆగస్టు11: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో ఆదివారం అన్నబాహుసాఠే జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అన్నబాహుసాఠే విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న మాట్లాడుతూ సాహిత్య రంగంలో అన్నబాహు సాఠే చేసిన సేవలు మరువలేనివని, అందుకే ఆయనను సాహిత్య సామ్రాట్‌గా కీర్తించినట్లు తెలిపారు. అనంతరం ఇటీవల సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్రమోదీ, సీఎంలు చంద్రాబాబు, రేవంత్‌రెడ్డితోపాటు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, సోసైటీ డైరెక్టర్ గోవింద్‌రావు, ఎల్వీ మాజీ సర్పంచ్ పోతారెడ్డి, అన్నబాహుసాఠే క్రాంతి సేన ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షులు ఉత్తంభలేరావు, ఉపాధ్యక్షులు గణపతి, ఉపాధ్యాయులు శంకర్, రిటైర్డ్ ఆర్మీ అమృత్, తదితరులు ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని కోతుల్‌గాంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నాబాహుసాఠే విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. తన కవితల ద్వారా ప్రజలు అభివృద్ధిమార్గంలో నడవాలని సూచించారు. ప్రతిఒక్కరూ విద్యావంతులై ఉన్నతస్థాయిలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూమేష్, మాజీఎంపీపీ రామచంద్రారెడ్డి, ఎంపీటీసీ భోజన్న, ఎంఆర్‌పీఎస్ నాయకులున్నారు.



అన్నాబాహుసాఠే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కోతుల్‌గాంలో నివాళులుర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న రవి కుమార్

ముగిసిన ఆదివాసి దినోత్సవ వారోత్సవాలు

• జిల్లాకు రాంజీ గోండు నిర్మల్‌గా పేరుపెట్టాలి

నిర్మల్ కల్చరల్, ఆగస్టు11: ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాలు ఆదివారం నిర్మల్ జిల్లాకేంద్రంలో ముగిశాయి. ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ హాజరై మాట్లాడుతూ నిర్మల్ జిల్లాకు రాంజీ గోండు నిర్మల్ జిల్లాగా పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తీర్మానం చేశారు. ఆదివాసీలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, గూడెంలకు రోడ్లు నిర్మించడం త్రీఫేస్ విద్యుత్, త్రాగునీరు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర సౌకర్యాలు కల్పించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర ఇంద్రజాలకుడు మెస్రం రాజు ప్రదర్శన అమితంగా అలరించింది. రాష్ట్ర నాయకులు మెస్రం రాజు, కృష్ణ కుమార్, జిల్లా కార్యదర్శి తొడసం శంఖు, ఆనందరావు, సోయం సూర్యభాను, పుష్పలత, సుమిత్ర, పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల వస్త్రం పంపిణీ : డీఈవో

నిర్మల్ కల్చరల్, ఆగస్టు11: పాఠశాల విద్యార్థులకు రెండోజత ఏకరూప దుస్తుల వస్త్రం అన్ని మండలాలకు పంపిణీ చేస్తున్నట్లు ఒక ప్రకటనలో డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే 13మండలాలకు పంపిణీ చేశామని, మిగతావి నేడు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు పాఠశాలల వారీగా విభజించి స్వయం సహాయక గ్రూపుల ద్వారా తయారు చేయించి విద్యార్థులకు అందజేయాలని సూచించారు.

వాహనాల తనిఖీ



వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న ఎస్సై

కుంటాల, ఆగస్టు, 11: మండలంలోని కల్లూరు సమీపంలో భైంసా- నిర్మల్ జాతీయ రహదారిపై ఆదివారం ఎస్సై రజనీకాంత్ వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్రవాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉండాలని, అంతేగాకుండా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మైనర్లకు వాహనాలను ఇవ్వొద్దని సూచించారు. నాలుగు చక్రాల వాహనాల వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఈ తనిఖీల్లో కుంటాల పోలీసులు ఉన్నారు.

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 11: టీఎస్ యూటీఎఫ్ నాయకుడు, ఉపాధ్యాయుడు బక్కన్న శనివారం ఆకస్మికంగా మృతి చెందగా ఆయనకు ఆదివారం సంఘ నాయకులు నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి అశోక్, పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మేదరి సంఘ నూతన కార్యవర్గం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 11: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం మేదరి సంఘ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షుడిగా మదిరే మోహన్ ఎన్నిక కాగా అధ్యక్షుడిగా మదిరే లింగన్న, ఉపాధ్యక్షుడిగా ప్రభాకర్, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా నరేష్, సహాయ కార్యదర్శిగా సంతోష్, సలహా సభ్యులు ఎన్నికయ్యారు.

నీ కూతురు డ్రగ్స్ అమ్ముతుంటే పట్టుకున్నాం..

- పది నిమిషాల్లో నా దగ్గరకు రావాలి
- అపరిచిత వ్యక్తి వీడియో కాల్‌లో బెదిరింపు
- భయపడ్డ తల్లిదండ్రులు


కాంబ్లే వెంకటేష్

భైంసా రూరల్, ఆగస్టు 11: భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన కాంబ్లే వెంకటేష్‌కు అపరిచిత వ్యక్తులు 923126480921 నుంచి వీడియో కాల్ వచ్చింది. నీ కూతురు కాంబ్లే శృతిని డ్రగ్స్ అమ్ముతుంటే పట్టుకున్నానని, పది నిమిషాల్లో నాదగ్గరకు రావాలని బెదిరించాడు. దీంతో తీవ్ర అయోమయానికి గురైన తండ్రి వెంకటేష్ మాట్లాడుతూనే ఒక్కసారి ఫోన్ కట్ చేసి పాఠశాలను సంప్రదించాడు. విద్యార్థి సేఫ్‌గా ఉందని తెలుసుకున్న తండ్రి ఊపిరి పీల్చుకున్నాడు. కాగా, అపరిచిత వ్యక్తుల కాల్స్ వల్ల తెలియని అయామక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, జాగ్రత్తగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

డిప్లొమా హోల్డర్లకు అవకాశం ఇవ్వాలి: హెచ్‌ఎంఎస్

శ్రీరాంపూర్, ఆగస్టు 11: సర్వేస్ డిపార్ట్ మెంట్లలో డిప్లొమో హోల్డర్లకు అవకాశం ఇవ్వాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఓసీపీ, ఇతర విభాగాల్లో ఖాళీగా ఉన్న ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ పోస్టుల ను భర్తీ చేసేందుకు సింగరేణి యాజమాన్యం శనివారం సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. ఈ ఉత్తర్వు ప్రకారం ఎలక్ట్రికల్ డిప్లొమో చేయని వారికి మాత్రమే అని పేర్కొన్నారని, దీనివల్ల అండర్ గ్రౌండ్‌లో పనిచేస్తూ ఎలక్ట్రికల్ డిప్లొమా కలిగి ఉన్న వారికి నష్టం జరుగుతుందన్నారు.

ఈ సర్క్యులర్‌తో అనుభవం, డిప్లొమా ఉన్న అర్హులు నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే విభాగంలో ఒకేవిధమైన పనులు చేస్తున్న వారిని రెండుగా విభజించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. వెంటనే యాజమాన్యం స్పందించి అందరికీ సమానం అవకాశం కల్పించాలని, సర్క్యులర్‌ను రద్దు చేసి మరోటి ఇవ్వాలని వారు కోరారు.

ఎన్నికలు నిర్వహించినా.. పరిష్కారం కాని సమస్యలు

రామకృష్ణాపూర్, ఆగస్టు 11: సింగరేణిలో ఎన్నికలు నిర్వహించినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని సీఐటీయూ నాయకులు పేర్కొన్నారు. ఆదివారం యూనియన్ కార్యాలయంలో సింగరేణికాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు వెంకటస్వామి, అల్లి రాజేందర్ మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించినా పలు దీర్ఘకాలిక కార్మిక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోతే త్వరలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌ఉపాధ్యక్షులు రామగిరి రామస్వామి, వడ్లకొండ ఐలయ్య, సీనియర్ నాయకులు అల్వాల సంజీవ్, అర్గనైజర్లు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి

● హైకోర్టు న్యాయాధికారులు

బోథ్ , ఆగస్టు 11 : కేసుల సత్వర పరిష్కారానికి గాను అందరి సహకారంతో కృషిచేయాలని హైకోర్టు న్యాయాధికారులు వినోద్‌కుమార్ సృజన లక్ష్మణుడు పేర్కొన్నారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో 12 కోట్ల 75 లక్షల 25 వేల రూపాయలతో నిర్మించతలపెట్టిన కోర్టు భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోర్టులలో కేసులు సత్వరం పరిష్కారం జరిగితే ప్రజల్లో న్యాయవ్యవస్థ పట్ల మరింత నమ్మకం పెరుగుతుందని వారు పేర్కొన్నారు. కోర్టులో పని చేసే సిబ్బందితో పాటు పోలీసు అధికారులు కలిసి కేసుల పరిష్కారానికి సహకారం అందించినట్లయితే కేసులను పేరుకుపోకుండా సత్వరం పరిష్కరించుకునే వీలుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే మొట్ట మొదటిసారి ఎన్సీసీ ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా కోర్టు భవనం నిర్మాణం జరగడం గర్వంగా ఉందన్నారు. అంతేగాక ఏడాది లోపు భవన నిర్మాణం పూర్తి అవుతుందని పేర్కొన్నారు.



బోథ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న హైకోర్టు న్యాయాధికారులు

బోథ్‌లో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనానికి ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు హాజరు కావడం గర్వించదగ్గ విషయమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్పీగౌస్ అలం పాల్గొని న్యాయవాదులకు పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతిం చారు. ఈ సందర్భంగా న్యాయవాదులు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్థానిక న్యాయమూర్తి ఇది హాస్సేన్ న్యాయవాదుల ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తులను మేళతాళాలతో స్వాగతించారు.

రేపు ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా మహాసభలు

ఉట్నూర్, ఆగస్టు11: జిల్లా కేంద్రంలోని కొమురంభీం భవనంలో మంగళవారం నిర్వహించనున్న ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి కోరారు. 13న నిర్వహించబోయే ప్రగతిశీల మహిళా సంఘం ఆదిలాబాద్ జిల్లా ఏడో మహాసభల కరపత్రాలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దుర్గం కళావతి మాట్లాడుతూ ప్రగతిశీల మహిళా సంఘం నిరంతరం మహిళల హక్కుల కోసం, మహిళల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తుందని, మహిళల పైన జరుగుతున్న లైంగిక దాడులకు వ్యతిరేకంగా, సారాకు వ్యతిరేకంగా, బెల్ట్‌షాపులకు వ్యతిరేకంగా, కల్తీ సారా వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించిందని, అలాగే స్త్రీ, పురుష సమానత్వం కోసం మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పెర్కగంగమ్మ, లక్ష్మి, రాధాలు పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించేది లేదు


కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో కంది శ్రీనివాస్‌రెడ్డి

● కంది శ్రీనివాస్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్,ఆగస్టు11: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలోకి చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆదివారం పద్మశాలి సంఘం సభ్యులు, 34వ వార్డు బీఆర్ఎస్ నాయకులు, తెలంగాణ చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షులతో పాటు ఆదిలాబాద్ రూరల్ మండలం నుంచి పెద్దఎత్తున కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కంది శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

అనంతరం కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ స్థలంలో భూములన్న యాపల్‌గూడ రైతులను ఎమ్మెల్యే పాయలశంకర్ బెదిరించడం పై ఆయన మండిపడ్డారు. ఎకరంకు రూ.16లక్షలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం చెబితే ఇప్పుడు రూ.8లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పడం, భూములు ఇవ్వకుంటే కట్టేసి భూములు లాక్కుంటామని రైతులను బెదిరించడాన్ని ఆయన తప్పుబట్టారు. రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. రైతుల పై చేయిపడితే ఖబర్ధార్ అని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా గెలిచి పాయలశంకర్ అధికార దర్పాన్ని ప్రదర్శిస్తూ విర్రవీ గుతున్నారని విమర్శించారు.ఇందులో నాయకులు జహీర్ రంజాని, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మాసంతోష్, కౌన్సిలర్లు భూమన్న, మాజీ ఎంపీటీసీలు జంగుపటేల్, చిట్యాల భూమన్న, ఎంఎ షకీల్, నాయకులు బండి దేవిదాస్ చారి, సుధాకర్ గౌడ్, తదితరులు పాల్గొల్గొన్నారు.

వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా


రహదారిపై రాస్తారోకో చేస్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

తలమడుకు, ఆగస్టు 11 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో ఆదివారం తలమడుగు మండల మాల, మాల ఉపకులాల ఆధ్వర్యం లో గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలతో నివాళులు అర్పించి అంబేద్కర్ విగ్రహం నుంచి తాంసి బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి సుంకిడి అంతరాష్ట్ర రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. నిరసన కారణంగా వాహనాల రాకపోకలు నిలిచిపోగా పోలీసులు వచ్చి, నిరసనకారులతో మాట్లాడి వాహనాల రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు క్రాంతి కుమార్ మాట్లాడుతూ దళి తుల ఐక్యమత్యాన్ని దెబ్బతీయడం కోసమే కేంద్ర ప్రభు త్వం ఎస్సీ వర్గీకరణను సుప్రీం కోర్టు ద్వారా ముందుకు తీసుకువచ్చిందన్నారు. రాబోయే రోజుల్లో దళితుల రాజ్యమేలుతారని ముందే గ్రహించి ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సరైనది కాదని వర్గీకరణను వెంటనే నిలిపివేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుకుంటి క్రాంతి కుమార్. ప్రధార కార్యదర్శి నిమ్మల గజానంద్. గౌరవధ్యక్షులు ముక్కల రాజేశ్వర్, ట్రెజరీ మగ్గిడి ప్రకాష్, వైస్ ప్రెసిడెంట్ రమాకాంత్, ముఖ్య సలహాదారులు నేతుల గంగన్న, గడుగు పోచ్చన్న, బోండ్ల రమేష్, ప్రవీణ్, దేవన్న, అఖిలేష్, నరేష్. ప్రతాప్, వినోద్, దేవదాస్, మల్లేష్, కృష్ణ ,దేవల్ల స్వామి, ఎం. అశోక్, వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, గ్రామ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

మినుము పంటకు ఫంగస్ తెగుళ్లు

● ఆందోళనలో మినుము రైతులు


ఫంగస్ సోకిన మినుము పంట పొలం

తాంసి, ఆగస్టు 11 : ఎన్నో ఏళ్లకు ఈ ఏడు ఖరీఫ్‌లో మినుము పంట వేసిన రైతాం గానికి అప్పుడే నష్టం వాటిల్లుతుంది. ఎన్నో ఆశ లు పెట్టుకుని ఎలాగైనా ఈసారి పంటను సాగుచేసి గణనీయమైన దిగుబడి సాధించాలని ఆశ ఎడ్డారు. ఆశించిన రీతిలోనే ఖాతా పూత వచ్చే సమయంలోనే పంటకు యెల్లో కలర్ ఫంగస్ సోకింది. దీంతో పంట అంతా పచ్చగా మారుతుంది. ఈ విషయాన్ని తెలుసుకుంటున్న రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడు మండలంలో సుమారు 800 ఎకరాల వరకు ఈ పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పంట ఖాత పూదశలో పంట ఉంది. అయితే ఈ సమయంలోనే పంటకు తెగులు వ్యాపిస్తుండటంతో నివారణ ఉపాయం తెలియక రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి పొందాలన్న ఆశతో రైతులు ముందడుగు వేసినప్పటికీ ఫలితం ఆశించిన స్థాయిలో లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

రద్దయిన అంతర్ రాష్ట్ర బస్సుసర్వీసులు

బోథ్, ఆగస్టు 11 : నిర్మల్ డిపో నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు అంతర్ రాష్ట్ర సర్వీస్ అయిన మహారాష్ట్రలోని కిన్వాట్ వరకు వెళ్లే బస్సును అధికారులు మూడురోజుల క్రితం రద్దు చేయడంతో బోథ్ ప్రాంత ప్రయాణీకులు, వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఆదాయం రావడం లేదన్న సాకుతో నిర్మల్ నుంచి బోథ్‌కు వచ్చి ఓ సర్వీస్‌తో పాటు మరో అంతర్ రాష్ట్ర సర్వీసును రద్దుచేసి ఈ ప్రాంత ప్రయాణీకులను ఇబ్బందుల్లోకి నెట్టడం జరిగింది. కింద వైపు నడిపే బస్సును సరైన ఆదాయం రావడం లేదంటూ మంచిర్యాలకు బస్సును నడుపుతున్నారు. ప్రతిరోజు అరగంటకు బోథ్ నిర్మల్ జిల్లా కేంద్రాలకు నడిచే ఆర్టీసీ బస్సులు కిక్కిరిసిన ప్రయాణీకులతో ప్రయాణిస్తున్నాయి. అయితే నిర్మల్ డిపోలో పనిచేసే అధికారుల స్వార్థంతో ఈ బస్సులను రద్దు చేశారన్న విమర్శలు వస్తున్నాయి. వాస్తవానికి నిర్మల్ డిపోకు బోథ్ ప్రాంగణం నుంచి ప్రతిరోజు ఐదు వేలకుపైగా ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారు. రోజంతా ఆదాయం వస్తున్న ఈ రెండు బస్సులను

● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

రద్దుచేయడంలో అంతర్యం ఏమిటని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. బస్సు సర్వీసులను అధికారులు తిరిగి పునరుద్ధరించే విధంగా చూడాల్సిన బాధ్యత అధికారులపై, స్థానిక ప్రజా ప్రతినిధులపై ఉంది.

● పునరుద్దరించేలా చర్యలు - ఎమ్మెల్యే

నిర్మల్ డిపో నుంచి ఇటీవల రద్దు చేసిన కిన్వాట్ అంతర్ రాష్ట్ర బస్సు సర్వీసును పునరు ద్ధరించేందుకు నిర్మల్ డిపో మేనేజర్ హామీ ఇవ్వడం జరిగిందని స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ పేర్కొన్నారు. గత నాలుగు రోజులుగా బస్సు రద్దు చేసిన విషయమై కొంతమంది ప్రయాణీకులు తమ దృష్టికి తీసుకువచ్చారని ఆయన అన్నారు. అయితే ఈ విషయమై ఆర్టీసీ నిర్మల్ డిపో మేనేజర్‌ను వివరణ కోరడం జరిగిందన్నారు. త్వరలో ఈ బస్సును ప్రారంభించడం జరుగుతుందని మేనేజర్ తెలిపారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

కిక్ బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 11 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని స్టేడియంలో శనివారం జరిగిన జోనల్‌స్థాయి పోటీల్లో నిర్మల్ బాక్సర్లు 15 మంది పాల్గొని తమ ప్రతిభ కనబర్చారు. గోల్డ్, సిల్వర్ పతకాలు సాధించారని జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రస్వామి తెలిపారు. 8 మంది గోల్డ్ పతకాలను సాధించగా నలుగురు సిల్వర్ పతకాలు సాధించారన్నారు. అండర్ 12, 17, 14 బాలికలకు పోటీలు నిర్వహించారు. వీరిని జిల్లా క్రీడల అధికారి శ్రీనివాస్ అభినందించారు.

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోగులకు కరువైన రక్షణ

● పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
● రాత్రివేళ ఆసుపత్రికి రావడానికి భయపడుతున్న రోగులు
● ఆసుపత్రి ఆవరణలో పచ్చగడ్డి ,పిచ్చిమొక్కలు
● విషపురుగులు, పాములు, తేళ్ల సంచారం


నార్నూర్ మండల ఆసుపత్రి

ఉట్నూర్, ఆగస్టు 11: ప్రభుత్వాలు అధికారులు మారుతున్న ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ గిరిజన ప్రాంత సమస్యలు మాత్రం మారడం లేదు. ఇంకా అంధకారంలోనే కనబడుతున్నాయి. ఎందుకు ప్రభుత్వం అమాయక ప్రాంత గిరిజనుల పై వివక్ష చూపుతుంది అనేది ప్రాంత వాసుల హాట్ టాపిక్. ప్రభుత్వం అందించే సేవలు ముఖ్యమైంది ఆరోగ్య సేవ మరి జిల్లా గిరిజన ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఆసుపత్రులను ఎందుకు మెరుగు పర్చడంలేదు జన్నాల ప్రశ్న. ప్రతియేడాది మేము ప్రజలకు మెరుగైన వైద్యం కోసం లక్ష కోట్లు ఖర్చు చేస్తున్నాం అనే ప్రభుత్వాలకు తాజాగా ఇక్కడ ఉన్న పరిస్థితులు ఎందుకు కనబడడం లేదా ఎందుకు ఇంత నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు అనేది జనాలకు అంతుచిక్కని జవాబు. వాస్తవానికి నార్నూర్ 30 ఎడకల ప్రభుత్వ ఆసుపత్రి అనేక సమస్యలు దర్శనం ఇస్తున్న అధికారులు ప్రజాప్రతినిధులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రికి డాక్టర్, ఇతర సిబ్బంది కావాల్సిన మందులు సరిగా లేక ఇక్కడివచ్చే రోగులు అసహానం వ్యక్తం చేస్తున్నారు. అత్యవసరం సమయం గుండెనొప్పి పాము కాటు, కిడ్నీ, యాక్సిడెంట్, ఇతర వైద్యం అందేలా లేదు. పేరుకి పెద్ద ఆసుపత్రి ఉంది రోగులకు రక్షణ కరువైంది.రాత్రి వేల ఆసుపత్రికి రావడానికి ప్రజలు భయపడు తున్నారు. వెళ్లే దారికి వీధి దీపాలు లేవు. రోడ్డు పైన పదుల సంఖ్యలో వీధికుక్కలు దాడికి ప్రయత్నం చేస్తుంటాయి. రోడ్డు అంత చిక్కటి ఉంటది దీంతో వైద్యం కోసం ఆసుపత్రికి రావడానికి భయపడుతున్న రోగులు కనీసం ఆసుపత్రి చుట్టు పక్కల పరిశుభ్రత లేనందున అంత పచ్చిగడ్డి, పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తున్నాయి. ఆసుపత్రిఇ బయట చుట్టు పక్కల వీధి లైట్లు లేనందున విష పురుగులు పాములు, తేలు ఆసుపత్రి లోపల వస్తున్నాయి. తాజాగా శనివారం రాత్రి 8గంటల సమయంలో నాగుపాము లోపలకు వచ్చి కలకలం లేపడం ఒక్కసారిగా రోగులు సిబ్బంది ఉరుకులు పరుగులు పెట్టారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు పామును కొట్టి చంపేయడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. అనుకోకుండా అదే పాము ఎవరినైనా కాటేస్తే పెద్ద సంఘటన జరిగితే దీనికి ఎవరు బాధ్యులు ప్రాంత వాసులు ప్రభుత్వ అధికారుల పని తీరు పై మండిపడుతున్నారు. ఇక్కడ రాత్రి పూట అత్యవసర వైద్యం కావాలంటే ఇక్కడి సిబ్బంది ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. పలుమార్లు అయితే పాఠశాల విద్యార్థులకు వాంతులు, విరేచనాలు రాత్రిపూట ఆసుపత్రికి వస్తే సిబ్బంది లేక చాలా సార్లు ఆసుపత్రి ముందు యువకులు ధర్నా చేసిన రోజులు ఉన్నాయి. ఇలాంటి దారుణమైన పరిస్థితులు కనబడుతున్న ఇంత పెద్ద ప్రభుత్వ ఆసుపత్రికి అన్ని సదుపాయాల మోక్షం ఎప్పుడు లభిస్తుందని ఎదురు చూపులు ఉన్న ఉమ్మడి నార్నూర్ దళిత గిరిజన వాసులు.


ఆసుపత్రి ఆవరణలో విచ్చలవిడిగా తిరుగుతున్న పిచ్చికుక్కలు

వెంటనే ప్రభుత్వ సిబ్బందిని నియమించాలి

నార్నూర్ ప్రభుత్వ ఆసుపత్రి పై ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే, ఎంపీ ఇతర ప్రజా ప్రతినిధులకు అనేక సార్లు సమస్యల పై విన్నవించి ఫిర్యాదులు చేసిన ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదు. అంటే గిరిజన ప్రాంత వాసులమైన మాకు మెరుగైన వైద్యం ఎందుకు ఇవ్వడం లేదు. అరకొర మందులు ఉంటాయి. డాక్టర్ మిగితా సిబ్బంది లేరు. రోజు రోగుల సంఖ్య పెరుగుతుంది. కనీస సౌకర్యాలు లేవు. ఇక ప్రభుత్వం సమస్య పరిష్కారం చేయక పోతే ఇక గ్రామస్థులు, రోగులతో నిరసన ధర్నా కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. - రాథోడ్‌విక్కు, నార్నూర్

అధ్వానంగా భగవాన్‌పూర్ రోడ్డు


భగవాన్‌పూర్ గ్రామ ముఖ చిత్రం

భీంపూర్, ఆగస్టు11: మండలంలోని అడవి సమీప భగవాన్‌పూర్ కొత్త గిరిజన పంచాయతీ మండల కేంద్రం భీంపూర్ నుంచి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న భగవాన్‌పూర్ వెళ్లాలంటే అర్లి(టి) తర్వాత ఉన్న మందపల్లి వాగు దాటాల్సి ఉంటుంది. ఆ తరువాత భగవాన్‌పూర్ వరకు ఉన్న ఐదు కిలో మీటర్ల మట్టి రోడ్డుపై వెళ్లాల్సి ఉంది. అయితే అసలే గుంతల మయంగా ఉన్న ఈ రోడ్డు వర్షాకాలం ఎడ తెరిపి లేని వానలకు అడుగు తీసి అడుగు వేయలేని విధంగా తయారైంది. దీంతో ఏవైనా పనులకు ద్విచక్ర వాహనాలతో బయటకు రావాలంటే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇది ఇలా ఉంటే ఈ రోడ్డు సౌకర్యం గురించి గత టీఆర్ఎస్ సర్కారు హయాంలో, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తరువాత కూడా గ్రామస్తులు ప్రజాప్రతి నిధులు, అధికారులకు ఎన్నోసార్లు విజ్ఞప్తులు చేసుకున్నారు. అయిన ఫలితం కనిపించడం లేదు. ఇటీవలే జిల్లా కలెక్టర్ భీంపూర్ మండలంలో పర్యటించినప్పుడు కూడా వినతిపత్రం అందించారు.

● అత్యవసర వైద్యం అందదు


కాగా అడవి దగ్గర ఉన్న భగవాన్‌పూర్ వాసులు వర్షాకాలంలో అనారోగ్యానికి గురి అయితే అత్యవసర వైద్య పరిస్థితి ఉంటే కనీసం 108అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి. అలాగే ఆ రోడ్డు గుండా రోగులకు కనీసం ద్విచక్ర వాహనాలు, ఎడ్ల బండ్లలో వాగు ధరించి అర్లి(టి) వరకు కూడా తీసుకురాలేని పరిస్థితి ఉంది. కొత్త పంచాయితీ అన్న మాటే గాని ఈ గిరిజన గ్రామానికి కనీస సౌకర్యాలు లేవు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు భగవాన్‌పూర్‌పై దృష్టి సారించాల్సిన ఉంది.

● బ్రిడ్జి రోడ్డు సౌకర్యాలు అవసరం

మా గ్రామం అడవిలోనే ఉన్నది. బాగా వర్షాలు కురిస్తే చుట్టూరుగా వాగులే ఉంటాయి. ఎక్కడికి పోలేని పరిస్థితి ఉంటుంది. అధికారులకు, నాయకులకు ఎన్నో సార్లు మొర పెట్టుకుని విసిగిపోయాము. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు భగవాపూర్‌కు రోడ్డు, బ్రిడ్జి సౌకర్యాలు కల్పించాలి.
- అడ మారుతి, భగవాన్‌పూర్, గ్రామస్తుడు


అధ్వాన్న స్థితిలో ఉన్న భగవాన్ పూర్ రోడ్డు


భగవాన్‌పూర్ రోడ్డు బురదలో ఇరుక్కున్న వాహనం



జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 11: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా తైక్వాండో క్రీడాకారులు అక్టోబర్‌లో ఆగ్రాలో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాలకు ఎంపికయ్యారు. జోగులాంబ గద్వాల జిల్లాలో జరిగిన ఇంటర్ డిస్ట్రిక్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ కోచ్ అన్నారపు వీరేష్, తైక్వాండో క్రీడాకారులు శివ కుమార్, వనితా రాథోడ్, దివ్య ప్రతిభ కనబరిచి జిల్లాకి నాలుగు వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారు.





● తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ ఖుష్బుగుప్తా



● కృత్యదార శిక్షణ పొందుతున్న ఇంగ్లీష్ టీచర్లు



ఆశ్రమ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్స్!

● ఆంగ్ల విద్యలో ప్రావీణ్యం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ

● పరిశీలనకు స్పెషల్ ఆఫీసర్లు

ఉట్నూర్, ఆగస్టు 11: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఆధ్వర్యంలోని ఉమ్మడి జిల్లాలో ఉన్న 133 గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో స్పోకెన్ క్లబ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఖుష్బూగుప్తా గిరిజన విద్యపై ప్రత్యేకదృష్టి సారించారు. తరచూ ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేస్తూ ఆయా పాఠశాలలో బోధన కూడా చేవారు. పిల్లలకు చదవడం రాయడంతో పాటు స్పష్టంగా మాట్లాడే విధానాలు నేర్పించాలని చెబుతూ వచ్చిన ఎలాంటి ప్రయోజనం కనిపించకపోవడంతో స్పోకెన్ క్లబ్స్‌ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో ప్రావీణ్యం పెంచవచ్చని భావించారు. గిరిజన విద్యార్థులను ఆంగ్లంలో దారలంగా మాట్లాడే విధంగా తయారు చేయడమే ప్రధానఉద్దేశంగా భావించారు. తన ఆలోచనతో ప్రతీ ఆశ్రమ పాఠశాలలో స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్లబ్‌ల నిర్వహణ కోసం హ:దరాబాద్‌కు చెందిన తెలంగాణ ఎడ్యుకేషన్ లీడర్‌షిప్ కలెక్టివ్ (టీఈఎల్‌సీ) సౌజన్యంతో వారి బృందాల ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ఇంగ్లీష్ బోధించే ఉపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటుచ ఏశారు. మూడో తరగతి నుంచి 8వ తరగతి వరకు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఇంగ్లీష్ మాట్లాడడమే ప్రధాన ఉద్దేశంగా ఈ క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. గిరిజన విద్యార్థులకు అర్థమయ్యే విధంగా కృత్యాధార విద్యతో పాటు బృందాల ద్వారా అంగ్లం పై పట్టు సాధించే విధంగా ప్రతి వారినికి ప్రతి పాఠశాలలో మూడు నుంచి ఐదు తరగతులు విద్యార్థులకు ప్రతి రోజు, 6,7,8 తరగతుల విద్యార్థులకు వారంలో రెండు సార్లు మాత్రమే తరగతులను ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించారు.

● టీచర్లకు శిక్షణ...

అధికారుల సూచన మేరకు విద్యార్థులు ఇంగ్లీష్‌లో మాట్లాడే విధంగా భాష నైపుణ్యం మెరుగు పరచాలని టీచర్లకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలోని పీఎంఆర్సీలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలకు చెందిన గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు, ఆసిఫాబాద్ జిల్లాకేంద్రంలో కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలో గిరిజన సంక్షేమ టీచర్లకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. మొదటి స్థాయిలో విద్యార్థులకు నిర్ధారణక పరీక్ష, రెండవ స్థాయిలో బృందాలుగా విభజన, మూడో స్థాయిలో కృత్యాచరా బోధన అందించనున్నారు. ప్రతీ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడికి ఐటీడీఏ ద్వారా కరదీపికలను కూడా అందించారు. ఆదిలాబాద్ జిల్లాలోని 54 ఆశ్రమ పాఠశాలలో 11,131మంది విద్యార్థు లకు 125మంది ఇంగ్లీష్ బోధకులకు, ఆసిఫాబాద్ జిల్లాలోని 45 ఆశ్రమ పాఠశాలల్లో చదువుకుంటున్న 7,800 మంది విద్యార్థుల కోసం 90 మంది బోధకులకు, మంచిర్యాల జిల్లాలోని 17పాఠశాలల్లో 2600 విద్యార్థుల కోసం 34 మంది టీచర్లకు, నిర్మల్ జిల్లాలోని 16 పాఠశాలలో చదువుకుంటున్న 3432 మంది విద్యార్థుల కోసం 34 మంది బోధకులను ఏర్పాటు చేసి శిక్షణ ఇచ్చారు. ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఐటీడీఏ పీఎంఆర్సీ సిబ్బంది, టీఎల్‌సీ సభ్యులు పర్యవేక్షిస్తారు. ఉమ్మ డి జిల్లాలో ఉన్న నలుగురు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్లు స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌లపై పూర్తి పర్యవేక్షణ నిర్వహిస్తారు. బేస్‌లైన్ టెస్టు, ఎండ్‌లైన్ టెస్టు, పెడుతూ విద్యార్థులు ఎంత మేర అంగ్లంలో ప్రావీణ్యం సాధించారని వివరాలను ప్రతివారం పీఓకు నివేదిక అందిస్తారు. 9,10 తరగతుల విద్యార్థులకు పదో తరగతి పరీక్షలో సమయం కేటాయించాల్సి ఉండడంతో వారిని స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్‌ల వైపు నుంచి మినహాయించారు.



ప్రత్యేక అధికారులను నియమిస్తాం

● ఖుష్బుగుప్తా (ఐటీడీఏ పీఓ, ఉట్నూర్)

స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్బుల పర్యవేక్షణకోసం ప్రత్యేక అధికారులను నియమి స్తాం. 133 ఆశ్రమ పాఠశాలల్లో త్వరలోనే ఈ క్లబ్‌లను ఆశ్రమ పాఠశాల ల్లో ప్రారంభిస్తాం. ప్రతీ విద్యార్థి ఇంగ్లీష్ మాట్లాడాలనేది ఆకాంక్ష.



పకడ్బందీగా నిర్వహిస్తాం

● ఆత్రం జగన్, ఏసీఎంఓ ఉట్నూర్

స్పోకెన్ క్లబ్‌లను పకడ్బందీగా నిర్వహిస్తాం. దీని కోసం ప్రత్యేక టైం కేటాయిస్తున్నాం. పీఓ కోరిక మేరకు ప్రతి గిరిజన విద్యార్థి ఇంగ్లీష్ దారాలంగా మాట్లాడే విధంగా తయారు చేస్తాం. ఉపాధ్యాయులను సమన్వయం చేసుకుని స్పోకెన్ ఇంగ్లీష్ క్లబ్లను నిరంతరం కొనసాగిస్తాం.

సంక్షిప్త సమాచారం

'చలో హైదరాబాద్ విజయోత్సవ సభను విజయవంతం చేయాలి'

తలమడుగు, ఆగస్టు 11: ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటాలు చేసి ఈరోజు విజయోత్సవ సభలు జరుపుకోవడానికి కారణమైన మందకృష్ణ మాదిగను మరువలేమని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ అరెల్లి మల్లేష్ అన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గొంటి ముక్కల ప్రేమేందర్ ఆధ్వర్యంలో ఆదివారం తలమడుగు మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లాకన్వీనర్ అరెల్లి మల్లేష్ హాజరై మాట్లాడారు. 30ఏళ్ల కలను సహకారంచేసి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు ఈనెల 13న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్న సందర్భంగా విజయోత్సవ స్వాగత కార్యక్రమానికి విచ్చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆశన్న, గంగన్న, అశోక్, ప్రసాద్, వినోద్, ఉషాన్న, అఖిలేష్‌వినయ్, తరుణ్, తదితరులున్నారు.

నీటి సమస్యను పరిష్కరిస్తాం

నార్నూర్, ఆగస్టు11: గాదిగూడ మండలం రుప్పాపూర్ గ్రామపంచాయతీ బొజ్జుగూడ గ్రామంలో నెల కొన్న నీటి సమస్యపై అధికారులు స్పందించారు. 'ఏజెన్సీ ప్రాంతాల్లో నీటిఎద్దడి' అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గత రెండునెలల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదు. బొజ్జుగూడ గ్రామానికి వెళ్లి అక్కడ ఉన్న నీటి సమస్య పరిష్కారం చేసి ప్రాంత ప్రజలకు నీరు అందిస్తామని అధికారులు తెలిపారు.

రేపు గుండె వ్యాధులపై వైద్య శిబిరం

ఆదిలాబాద్‌రూరల్, ఆగస్టు11: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలోని డైస్ సెంటర్‌లో ఈనెల 13న చిన్నారుల కోసం ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్బీఎస్‌కేలో 0-18 ఏళ్ల గల పిల్లలకు గుండె సంబంధిత సమస్యలకు ఈ శిబిరంలో వైద్య చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ కిమ్స్‌లోని పీడియాట్రిక్ కార్డియాలజిస్టులు బాధిత చిన్నారులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్యం అందజేస్తారని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు11: ఆదిలాబాద్ పట్టణంలోని బంగారిగూడలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆదివారం బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్న పిల్లల, కంటి ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నివిధేతరెడ్డి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను అందజేశారు. రీతన్య ఆస్పత్రి చైతన్య ఆస్పత్రి సౌజన్యంతో నిరుపేదల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు, శిబిరానికి విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, సొసైటీ సభ్యులు ఆసిఫ్, సాబీర్, ఆస్పత్రి సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

'ప్రతీఒక్కరు భగవద్గీత చదవాలి'

బోథ్, ఆగస్టు11: ప్రతీఒక్కరు భగవద్గీత చదవి శాంతియుతమైన జీవితాన్ని గడపాలని పద్మనాభ స్వామి పేర్కొన్నారు. భగవద్గీతను ఆచరించి అనుసరిస్తే జీవితంలో ఇబ్బందులు ఉండవని అన్నారు. తలమడుగు మండలంలోని అర్లి (కె) గ్రామంలో జరిగిన కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో జరుగుతున్న అఖండ జ్యోతి కార్యక్రమానికి మండలంలోని కౌటా(బి) గ్రామస్తులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి పద్మనాభ స్వామి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. శబరిమాత భక్తులు నర్సింగ్‌రెడ్డితో పాటు ఎడమల ధర్మారెడ్డి పూజాకార్యక్రమాలను నిర్వహించగా శ్రీకాంత్ భక్త బృందం గానాలాపన చేశారు. గాయకులు ఉపేందర్‌రెడ్డి, బద్దం ప్రభాకర్‌రెడ్డిల భక్తి గీతాలు ఆలపించి భక్తులను ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో డీఎస్పీ చౌహాన్, భక్తి ప్రాముఖ్యతను వివరిస్తూ గీతాలనుఆలపించారు.

న్యాయమూర్తులను కలిసిన న్యాయవాదులు

ఉట్నూర్, ఆగస్టు 11: జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా పరిపాలనజడ్జిలను ఉట్నూర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలుసుకొని పుష్పగుచ్ఛం అందించారు. ఆదివారం బోథ్ మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టు నూతన భవనం నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన హైకోర్టు న్యాయమూర్తులు వినోద్‌కుమార్, లక్ష్మణ్, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి సృజనలను ఆదివారం ఉట్నూర్‌జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు.

'కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం'



బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, ఆగస్టు11: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్‌పార్టీ సీనియర్ జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని సాయిలింగి గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల వివరాలు గ్రామీణ ప్రజలకు తెలయజేసే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈనెల 15లోగా రైతులందరికీ రూ.2లక్షల పంటరుణాలు మాఫీ అవుతుం దన్నారు. అనంతరం తలమడుగు మండల సాయిలింగి గ్రామంలో గోలి శ్రీనివాస్ మరణించడంతో వారి కుంటుంబాన్ని పరామర్శించారు. అలాగే ఆదేగ్రామానికి చెందిన ఇప్ప దశరథ్ మరణించడంతో వీరి కుటుంబాన్ని పరామర్శించారు. వీరివెంట మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మి రాజేశ్వర్, మాజీ ఎంపీటీసీ వెంకన్నయాదవ్, కాంగ్రెస్ నాయకులు గంగారం, మోహన్, విట్టల్, పొచ్చన యాదవ్, రామన్న, పోశెట్టి ఉన్నారు.

గ్రామాల్లో ప్రకృతి శోభ ఉట్టిపడాలి



ఇచ్చోడలో అటవీశాఖ అధికారులతో మొక్కలు నాటుతున్న నారాయణ మహారాజ్

ఇచ్చోడ, ఆగస్టు11: మొక్కలు నాటి.. వాటిని సంరక్షించాల్సిన పూర్తి బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని సంత్ శ్రీవైష్ణవసదన్ నారాయణ మహారాజ్ అన్నారు. ఆదివారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో సనాతన ధర్మసమితి ఆధ్వర్యంలో శ్రీరామ చరిత్ మానస్ హనుమాన్ చాలీసా రచించి రామమహత్యాన్ని మానవాళికి తెలిపిన గోస్వామి తులసీ దాస్ జయంతిని పురస్కరించుకుని ఆలయంలో మొక్కలు నాటే కార్యాక్ర మాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సిరికొండ, గుడిహత్నూర్ మండలాల్లో దాదాపు 20 వేల మొక్కలను సనాతన ధర్మసేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేసినట్లు చెప్పారు. అనంతరం అటవీ శాఖ అధికారులతో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పోలీస్‌స్టేషన్, అటవీశాఖ కార్యాలయాల్లో మొక్కలు నాటారు. అనంతరం అయ్యప్ప ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో పుండలిక్, మాజీ ఎంపీ పీ నిమ్మల ప్రీతంరెడ్డి, అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు, సనాతన ధర్మసేవా సమితి సభ్యులు, సామాజిక కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



నార్నూర్‌లో జాతీయ జెండాలతో నాయకులు



ఉట్నూర్ మండలంలో బీజేపీ బైక్ ర్యాలీ దృశ్యం

నార్నూర్, ఆగస్టు 11: ప్రతీ ఇంట్లో మువ్వన్నెల జాతీయ జెండా రెపరెపలాడాలి. ప్రతి ఒక్కరు దేశ భక్తితో మెలగాలని బిక్కురాథోడ్ పిలుపునిచ్చారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఆదివారం నార్నూర్ మండల కేంద్రం స్థానిక గాంధీచౌక్ వద్ద యువకులు కలిసి హర్‌ఘర్ తిరంగా కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రధానిమోదీ చేపట్టారని, ఇందులో భాగంగా ప్రతీ ఇంట్లో జాతీయ జెండా, సోషల్ మీడియాలో జాతీయ పతాకం ఫొటోను డీపీగా ఉంచుకోవాలని దీని ఉద్దేశమని చెప్పారు. తద్వారా ప్రజల్లో దేశభక్తి వస్తుందని అన్నారు. కార్యక్రమంలో ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇందులో యువ నాయకులు సంజయ్, రోహిదాస్, తదితరులున్నారు.

ఉట్నూర్: రానున్న స్వతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమంలో భాగంగా బీజేపీ కేంద్రం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం ఉట్నూర్ మండలం భారతీయ జనతా పార్టీ నాయకులు బైకుర్యాలీ నిర్వహించారు. మండలంలోని పులిమడుగు జగదాంబా దేవి ఆలయంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రాథోడ్‌రితేష్ జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్‌ల ఆధ్వర్యంలో పూజలు చేసిన అనంతరం ఘర్‌ఘర్‌తిరంగా కార్యక్రమంలో భాగంగా పులిమడుగు నుంచి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ బైక్ ర్యాలీ ద్వారా ఇంటింటికీ తిరంగా జెండా ఎగురవేయాలని కోరుతూ నినాదాలు చేస్తూ ఉట్నూర్ పట్టణంలోని వినాయకచౌక్‌కు చేరుకున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి కేంద్ర రాష్ట్రకమిటీ ఇచ్చిన పిలుపుమేరకు హర్ ఘర్‌తిరంగా ర్యాలీ చేపట్టారు.

బీజేపీ నిరసన ర్యాలీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనంగా ఆదివారం ఉట్నూర్ పట్టణంలోని వినాయక్‌చౌక్ నుంచి అంబేద్కర్‌చౌక్ వరకు బీజేపీ నాయకులు నిరసన ర్యాలీ నిర్వహించారు. నిరసన ర్యాలీ ద్వారా అంబేద్కర్‌చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాథోడ్ రితేష్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో హిందువులపై మానవత్వం మర్చిపోయిన కసాయి మూకలు హత్యలు చేస్తున్నాయని, వీటిని నిర్మూలించడానికి ప్రపంచ దేశాలు ముందుకు రావాలని కోరారు. ఇంత జరుగుతున్న హిందు వ్యతిరేక నాయకులు ఏ మాత్రం చలించడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు బింగివెంకటేశ్, కాల్వరవి, టేకం హరిప్రసాద్, బొడు కిరణ్, తన్నీరునితీస్, ఇప్పమధుకర్, సడిగే రాజేశ్వర్, దేవిదాస్, ఉపేందర్‌బానోత్, రాథోడ్ శేషారావు, రాథోడ్‌విఠల్ తదితరులున్నారు.

యాత్రను విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఆదేశాల మేరకు హర్‌ఘర్‌తిరంగా యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు అరెల్లి రాజలింగు పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్‌ఘర్‌తిరంగా కార్యక్రమంలో భాగంగా ముత్నూర్ నుంచి ఇంద్రవెల్లి వరకు బైక్‌ర్యాలీ, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ అంజీచౌరస్తా వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హర్‌ఘర్‌తిరంగా యాత్రను బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మెస్రం తుకారాం, కోవా రాజేశ్వర్, కనక హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



ఉట్నూర్‌లో నిరసన ర్యాలీ చేస్తున్న బీజేపీ నాయకులు



ఇంద్రవెల్లిలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు